క్లుప్తంగా

వడ్డీతో పంట రుణాల రెన్యూవల్

బత్తలపల్లి: వడ్డీ కట్టి పంటరుణాలు రెన్యూవల్ చేసుకోవచ్చని యూనియన్ బ్యాంకు అధికారులు స్పష్టం చేశారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల రైతులు పంట రుణాలు రెన్యూవల్ చేసుకోవడానికి బత్తలపల్లిలోని యూనియన్ బ్యాంకుకు వెళ్లగా.. అసలు, వడ్డీ కలిపి చెల్లించిన తర్వాతే రెన్యూవల్ చేసుకోవాలని ఫీల్డ్ ఆఫీసర్ స్పష్టం చేశారు. ఈ విషయమై పలువురు రైతులు ప్రజా సంఘాల నాయకులతో కలిసి బ్యాంకు అధికారులతో చర్చించారు. రీజనల్ మేనేజర్‌తో ఫోన్‌లో సంప్రదించారు. వెనువెంటనే ఆయన బత్తలపల్లి బ్యాంకుకు చేరుకుని ప్రజా సంఘాల నాయకులు, రైతులతో చర్చించారు. రైతుల అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన రీజనల్ మేనేజర్ సరోజ్ ఠాకూర్ వడ్డీ మాత్రమే చెల్లించి రెన్యూవల్ చేసుకోవాలని, పావలా వడ్డీ సైతం వర్తించేలా చూస్తామని హామీ ఇచ్చారు.

కమిషనర్‌కు సమ్మె నోటీసు

కదిరి టౌన్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, లేబర్ కోడల రద్దు కోరుతూ ఈ నెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ నాయకులు మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్‌కు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ, కోశాధికారి తిరుపాలు, సీఐటీయూ నాయకులు జగన్మోహన్, రామ్మోహన్, ముస్తాక్, అలీ, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సవ విగ్రహానికి ప్రాణప్రతిష్ట


ప్రాణ ప్రతిష్ట చేసిన ఏటిగంగమ్మ ఉత్సవ విగ్రహం

తలుపుల : మండల కేంద్రం ఎగువ పేట సమీపంలోని ఏటిగంగమ్మ ఉత్సవ విగ్రహానికి బలిజపేట రామాలయ ప్రాంగణంలో బలిజపేట వాసులు బుధవారం శాస్త్రోక్తంగా ప్రాణప్రతిష్టాపన నిర్వహించారు.

విద్యార్థుల మెదడుకు పదును

ధర్మవరం: గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో విద్యార్థుల మెదడుకు పదును పెడుతున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ తెలిపారు. ధర్మవరంలోని గ్రంథాలయాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. శిక్షణకు హాజరైన విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అందిస్తున్న సేవలు, వారు నేర్చుకుంటున్న అంశాలపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి అంజలి సౌభాగ్యవతి పాల్గొన్నారు

ఆరాధన ఉత్సవాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురం, కదిరిగేటు బ్రహ్మంగారి ఆలయం, ఇందిరానగర్‌లోనున్న పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ఆరాధన మహోత్సవాలు బుధవారం భక్తిశ్రద్ధల నడుమ నిర్వహించారు. లక్ష్మీచక్రవర్తి థియేటర్ ఎదురుగా ఉన్న కాలభైరవస్వామి ఆలయంలో పూజారి ధనుంజయ ఆచారి వీర బ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్డీటీపై కేంద్రం వైఖరి మారాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొత్తచెరువు: ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రజలకు దశాబ్దాలుగా విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలలో అనేక సేవలు అందించిన అర్డీటీ సంస్థ పట్ల కేంద్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని, రద్దు చేసిన ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే పునరుద్ధరించాలని వైఎస్సార్‌సీపీ మండల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కొత్తచెరువులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పేదలకు విశిష్ట సేవలందిస్తున్న అర్డీటీ సంస్థ విదేశాల నుంచి విరాళాలు సేకరించకుండా ఎఫ్‌సీఆర్‌ఏను నిలుపుదల చేయడం బాధాకరమన్నారు. ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించేలా కూటమి ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శ్యాంసుందర్‌రెడ్డి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు వడ్డే నారాయణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పాదయాత్ర వాల్మీకి శంకర్, సర్పంచ్‌లు ప్రకాష్, గోవిందరెడ్డి, నాయకులు ఎల్లప్ప, దేరంగుల వెంకటరాముడు, సోదనపల్లి రామాంజినేయులు, జైపాల్‌రెడ్డి, మన్నేరు ప్రసాద్, పూజారి పెద్దన్న, తేజ కిరణ్‌రెడ్డి, వడ్డే సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ సీఎంను కలిసిన బత్తల



కదిరి అర్బన్: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని బుధవారం ఆ పార్టీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బత్తల హరిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు వెంకటేశ్వరస్వామి ప్రతిమను అందజేశారు.

యుద్ధ సన్నాహం..
అప్రమత్తత అవశ్యం


ధర్మవరంలో ప్రజలను అప్రమత్తం చేస్తున్న ఆర్డీఓ మహేష్


ఓడీచెరువులో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు


కదిరిలో డీఎస్పీ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్‌పై అవగాహన


చెన్నేకొత్తపల్లి: సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్


బత్తలపల్లి ఆర్డీటీ ఆస్పత్రిలో మాక్ డ్రిల్

సాక్షి బృందం: శత్రుదేశం పాకిస్తాన్‌తో యుద్ధం మొదలైతే తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రక్షణ చర్యలపై ఎస్పీ రత్న ఆదేశాల మేరకు పోలీసులు మాక్‌డ్రిల్ చేసి అవగాహన కల్పించారు. ధర్మవరం రైల్వే స్టేషన్‌లో బుధవారం డీఎస్పీ హేమంత్‌కుమార్, వన్‌టౌన్ సీఐ నాగేంద్రప్రసాద్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ నటరాజ్, రైల్వే ఎస్‌ఎం చల్లా నరసానాయుడు ఆధ్వర్యంలో, కదిరి రైల్వే స్టేషన్‌లో డీఎస్పీ శివనారాయణస్వామి, ఆర్డీఓ వీవీఎస్ శర్మ ఆధ్వర్యంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. యుద్ధ సమయంలో బాంబులు పడినా, కాల్పులు జరిపినా ప్రజలు ఎలా తప్పించుకోవాలో పోలీసులు చేసి చూపించారు. విపత్తు సమయాల్లో ప్రజలకు అండగా పోలీసు, ఆరోగ్యశాఖ, అగ్నిమాపకశాఖ, రెవెన్యూ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో జీఆర్పీ సీఐ అశోక్‌కుమార్, ఫైర్ ఆఫీసర్ రాజు, కదిరి పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి, రైల్వే ఎస్‌ఐ రహీమ్, పట్టణ ఎస్‌ఐ బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

- దాయాది దేశం పాకిస్తాన్‌తో యుద్ధం జరిగే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి ప్రజలను హెచ్చరించారు. తాడిమర్రిలో బుధవారం పోలీసులు, అధికారులతో కలసి ఆయన మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు, అధికారులు పలు ప్రాంతాల్లో పలు విన్యాసాలు చేసి చూపించారు. బాంబులు పడితే ఇళ్లల్లోంచి ఎవ్వరూ బయటకు రాకుండా టేబుళ్లు, బల్లల కింద పడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ కృష్ణవేణి, వైద్యాధికారి హరిత, ఏఎస్‌ఐ సూర్యనారాయణరాజు, పోలీసులు, ట్రాన్స్‌కో సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త కాల్చివేతపై సీరియస్


జేసీబీతో చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

పుట్టపర్తి అర్బన్: పెడపల్లిలో సేకరించిన చెత్తను రోడ్డు పక్కన వేసి కాల్చేస్తున్న ఘటనపై అధికారులు సీరియస్ అయ్యారు. ఈ అంశంపై 'చెత్తకు నిప్పు .. కాలుష్యం ముప్పు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన వార్తకు ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఈఓఆర్డీ ఇందిరాబాల స్పందించారు. వారు ఆ గ్రామానికి వెళ్లి రోడ్డు పక్కన చెత్తను చూసి సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జేసీబీని తెప్పించి రోడ్డు పక్కన ఉన్న చెత్తను దూరంగా తరలించారు. ఇకపై చెత్తను డంపింగ్ యార్డుకు తరలించాలని, రోడ్డు పక్కన వేసి కాలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మన్యం వీరుడు అల్లూరి

బత్తలపల్లి: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు వర్ధంతిని బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ నరసింహనాయుడు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అల్లూరి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి శ్రీనివాసులు, ఈఓఆర్డీ క్రిష్టప్ప, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ ప్రతిష్ట



ముదిగుబ్బ: దొరిగిల్లులో బుధవారం శ్రీశైల భ్రమరాంబికా మల్లికార్జునస్వామి విగ్రహ ప్రతిష్ట వేడుకగా సాగింది. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హాజరై పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర సేవాదళ్ కార్యదర్శి ఇందుకూరు నారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీపీ నారాయణరెడ్డి, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీటీసీ వెంకటశివారెడ్డి, మునిచంద్ర, వెంకటేశ్వర్‌రెడ్డి, పాళ్యం క్రిష్ణ, వెంగళ్‌రెడ్డి, రామక్రిష్ణ పాల్గొన్నారు.

క్రికెట్, వాలీబాల్ కిట్ల పంపిణీ

ఓడీచెరువు : మిట్టపల్లికి చెందిన క్రీడాకారులకు వాల్మీకి సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగవేణి క్రికెట్ కిట్లు, వాలీబాల్ కిట్లు అందజేశారు. అనంతరం క్రీడాకారులు నాగవేణిని సన్మానించి, కృతజ్ఞతలు తెలిపారు

సమష్టిగా పార్టీని బలోపేతం చేద్దాం


చీనీకాయల దండతో కేతిరెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

ధర్మవరం రూరల్: గ్రామస్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు అందరినీ కలుపుకొని వైఎస్సార్‌సీపీని బలోపేతం చేద్దామని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పట్టణంలోని కేతిరెడ్డి నివాసంలో ఇటీవల నియమితులైన ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు గరుడంపల్లి నారాయణస్వామి, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ పోతుకుంట బోగే శ్రీనివాసరెడ్డి, నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షుడు రావులచెరువు చిరు వర్ధన్‌రెడ్డిల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేని చీనీకాయల దండతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రావులచెరువు ప్రతాప్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు చౌడప్ప, బడన్నపల్లి నరసింహులు, గోపాల్, గజ్జల శివ, అజంత కృష్ణ, రమణస్వామి, విజయ్‌కుమార్, తేజ, మల్లికార్జున, నాగరాజు, బత్తుల నాగార్జున, చిన్నోడు, ఓబిలేసు, రామాంజినేయులు అదే విధంగా పోతుకుంటకు చెందిన మాజీ సర్పంచ్ బోగే హనుమంతరెడ్డి, మాజీ డీలర్ కృష్ణారెడ్డి, ఎంపీటీ భర్త కొండా, సంజీవరెడ్డి, నరసింహారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, ఈశ్వరయ్య, తలారి వెంకటేష్, నులక వెంకటేష్, సురేంద్రరెడ్డి, రామచంద్ర, శివయ్య, లింగమయ్య, ముత్యాలు, నల్లపరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, శ్రీనివాసులు బిల్లే, రావులచెరువుకు చెందిన నాగా చెన్నకృష్ణారెడ్డి, వాల్మీకి దిలీప్, దివాకర్ నాయక అశోక్‌కుమార్‌రెడ్డి, భాస్కర్, బాలు, జక్క భార్గవ్, హరినాథ్ నాయక్, వర్ధన్ నాయక్, హరి నాయక్, ప్రకాష్ నాయక్, బాలాజీ నాయక్, బాబు, మనోజ్‌కుమార్, జ్యోతి సాయి, గణేష్, మనీ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ మేనేజర్ బాధ్యతల స్వీకరణ

తనకల్లు: కొక్కంటిక్రాస్ యూనియన్ బ్యాంక్ నూతన మేనేజర్‌గా సి.శ్రీనివాసులురెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ మేనేజర్‌గా పనిచేస్తున్న ఆంజినేయులునాయక్ ఇటీవల కదిరికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కణేకల్లు యూనియన్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాసులురెడ్డిని కొక్కంటి క్రాస్‌కు బదిలీ చేశారు. నూతన మేనేజర్ మాట్లాడుతూ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించడానికి కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

సంక్షిప్త సమాచారం

అన్నదాత సుఖీభవ రికార్డుల పరిశీలన

అమడగూరు: రైతుసేవ కేంద్రాల్లో అన్నదాత సుఖీభవ పథకం అమలు కోసం రెవెన్యూ రికార్డులను పరిశీలిస్తున్నట్లు వ్యవసాయాధికారి వెంకటరమణాచారి పేర్కొన్నారు. జాబితాలో ఉన్న రైతులందరూ ఆర్‌ఎస్‌కే సెంటర్‌కు వెళ్లి వేలిముద్ర వేస్తే అన్నదాత సుఖీభవ పథకం వర్తిస్తుందన్నారు.

సోలార్‌తో పర్యావరణ పరిరక్షణ

ధర్మవరం అర్బన్: సోలార్ ఏర్పాటుతో పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని ఆర్డీఓ మహేష్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో బుధవారం పీఎం సూర్య ఘర్ స్కీంపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ పీఎం సూర్య ఘర్ స్కీం కింద ప్రభుత్వం సబ్సిడీతో సోలార్ ప్యానల్ అందిస్తోందన్నారు.

రేషన్‌కార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అమడగూరు/ తాడిమర్రి: కొత్తగా రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోవచ్చని అమడగూరు తహసీల్దార్ రామనాథరెడ్డి, తాడిమర్రి సీఎస్‌డీటీ శారద వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు. అలాగే ఈ–కేవైసీ పూర్తి చేసుకోని వారు నెలాఖరులోగా చేసుకోవాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

తనకల్లు: చీకటిమానిపల్లి సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ గోపీ తెలిపారు. వీరి నుంచి రూ.1,700 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

నల్లచెరువు: గోరంట్లపల్లిలోని బి.బాలాజీ నాయక్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 288 టెట్రా ప్యాకెట్ల కర్ణాటక మద్యాన్ని ప్రోహిబిషన్ ఎక్సైజ్ ఎస్‌ఐలు జిలాన్ బాషా, ఎంఎల్ తిప్పేస్వామి బుధవారం స్వాధీనం చేసుకున్నారు. బాలాజీ నాయక్‌ను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజ్ఞానం పెంచుకోండి

కనగానపల్లి: వేసవి సెలవుల్లో విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరానికి వెళ్లాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ సూచించారు. స్థానిక గ్రంథాలయ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపును బుధవారం పరిశీలించారు. అనంతరం ఆమె అల్లూరి సీతారామరాజు వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి గోవిందు, యోగా గురువు సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆ పాఠశాలలను నిషేధించాలి

కదిరి అర్బన్: విద్యావ్యవస్థను భ్రష్టుపట్టిస్తున్న నారాయణ, చైతన్య పాఠశాలలను నిషేధించాలని వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లం రాజేంద్రప్రసాద్ యాదవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. చట్టపరంగా చర్యలు తీసుకోకుంటే ఉద్యమిస్తామని హెచ్చరించారు.

ఈఓఆర్డీకి పదోన్నతి

అమడగూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓఆర్డీగా పనిచేస్తున్న నసీమాకు పదోన్నతి లభించింది. ఈ మేరకు తలుపుల ఎంపీడీఓగా ఆమెను పదోన్నతిపై బదిలీ చేశారు. గురువారం ఈఓఆర్డీ బాధ్యతల నుంచి రిలీవ్ కానున్నారు. ఈ సందర్భంగా నసీమాకు అధికారులు, కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.


ధర్మవరంలో అమ్మవారికి కలశాలు మోసుకొస్తున్న సభ్యులు


చెన్నేకొత్తపల్లిలో కలశాల ఊరేగింపు


కదిరిలో అమ్మవారి గ్రామోత్సవం

వాసవీ మాతా నమోస్తుతే

సాక్షిబృందం: ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం వాసవీమాత జయంతిని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లోని ఆలయాల్లో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. ఆర్యవైశ్య మహిళలు కలశాలతో ర్యాలీగా వచ్చి అమ్మవారికి సమర్పించారు. ప్రత్యేకంగా మహా మంగళహారతి ఇచ్చారు. సాయంత్రం పలు చోట్ల ఉయ్యాల ఉత్సవం వైభవంగా నిర్వహించారు.


తాడిమర్రిలో ప్రత్యేక పూజలు అందుకుంటున్న వాసవీమాత


నల్లచెరువులో ప్రత్యేక అలంకరణలో వాసవీమాత


తాడిమర్రిలో కలశాలను తీసుకెళ్తున్న ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు

త్రివిధ దళాలకు కేతిరెడ్డి హ్యాట్సాఫ్


భారత సైన్యానికి మద్దతు తెలుపుతున్న అధికారులు, ప్రజలు

ధర్మవరం: 'ఆపరేషన్ సింధూర్'తో పాకిస్తాన్ ఉగ్రవాదుల వెన్నులో వణుకు పుట్టించిన భారత త్రివిధ దళాలకు మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి హ్యాట్సాఫ్ చెప్పారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలపై ఇండియన్ ఆర్మీ చేసిన దాడుల పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేయాలన్నారు. ఆర్మీకి మద్దతుగా ప్రతి భారతీయుడు అండగా నిలవాలన్నారు.

ఉగ్ర మూకలపై దాడిని స్వాగతిద్దాం

కనగానపల్లి: పాకిస్తాన్‌ను స్థావరంగా చేసుకుని అరాచకాలు సృష్టిస్తున్న ఉగ్రవాదులపై భారత సైన్యం జరిపిన క్షిపణి దాడులను ప్రతి ఒక్కరూ స్వాగతించాలని తహసీల్దార్ పీ.వీ. ప్రసాద్ తెలిపారు. మంగళవారం రాత్రి పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులపై భారత్ నిర్వహించిన 'ఆపరేషన్ సింధూర్'కు సంఘీభావంగా కనగానపల్లిలో బుధవారం రెవెన్యూ, పోలీస్ అధికారులు స్థానిక ప్రజలతో కలసి ర్యాలీ నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి భారత్‌మాతకు జై అంటూ నినాదాలు చేశారు.

అపూర్వ సమ్మేళనం


చదువులమ్మ ఒడిలో మళ్లీ కలుసుకున్న ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

పుట్టపర్తి అర్బన్: వారంతా పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు ఉన్నత పాఠశాలలో 2003–04లో పదో తరగతి చదువుకున్నారు. ఉన్నత చదువులు పూర్తయ్యాక వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. మళ్లీ పాత రోజులు గుర్తుకొచ్చాయి. పూర్వవిద్యార్థులంతా ఒకరినొకరు కలిసి యోగ క్షేమాలు తెలుసుకోవాలనుకున్నారు. అనుకున్నదే తడవుగా అందరినీ సెల్‌ఫోన్ల ద్వారా సంప్రదించి బుధవారం ఉన్నతపాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం పేరిట కలుసుకున్నారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఊరేగింపుగా తీసుకొచ్చి ఘనంగా సన్మానించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు నాటి మధుర స్మృతులను గుర్తు చేసుకున్నారు. కాసేపు చిన్న పిల్లల్లా మారిపోయారు. కబుర్లతో, కుటుంబ యోగ క్షేమాలతో సరదాగా గడిపారు.

ఆగిన నిర్మాణం.. తప్పని వ్యథ


మామిళ్లపల్లిలో అర్ధంతరంగా ఆగిన అంగన్‌వాడీ భవన నిర్మాణం

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన అంగన్‌వాడీ కేంద్రాల భవన నిర్మాణాలు అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో రూ.లక్షల ప్రజాధనం వృథా అవుతోంది. అంగన్‌వాడీ చిన్నారులు పక్కా భవనాలు లేక అద్దె భవనాల్లో మగ్గుతున్నారు. మండలంలో నాడు–నేడు కార్యక్రమం కింద మామిళ్లపల్లి, ముత్తువకుంట్ల, మద్దెలచెరువు గ్రామాలకు అంగన్‌వాడీ భవనాలు మంజూరయ్యాయి. వీటి నిర్మాణాలు కూడా ప్రారంభించి 60 శాతం పనులు కూడా పూర్తి చేశారు. కానీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. భవనాలు నిర్మాణ దశలోనే శిథిలావస్థకు చేరుకుంటున్నాయని ప్రజలు మండిపడుతున్నారు.

– కనగానపల్లి:

వృథాగా ప్రభుత్వ భవనం


చెన్నేకొత్తపల్లిలో వృథాగా ఉన్న పాత ఎంపీడీఓ కార్యాలయం

చెన్నేకొత్తపల్లి మండల కేంద్రంలో పాత ఎంపీడీఓ భవనం వృథాగా దర్శనమిస్తోంది. చాలా ఏళ్ల క్రితం నిర్మించిన ఈ భవనాన్ని ప్రభుత్వ కార్యకలాపాలకు ఉపయోగించుకోక పోవడంతో శిథిలావస్థకు చేరుకుంటోంది. ఇప్పుడు భవనం పైకప్పు దెబ్బతినడంతో పూర్తిగా వదిలేశారు. పట్టణం నడిబొడ్డులో విశాలమైన ప్రాంతంలో ఈ భవనం ఉంది. గత కొన్నేళ్ల క్రితం వరకూ ఇందులో ఎంపీడీఓ కార్యాలయం ఉండేది. కొత్త భవనం నిర్మించడంతో అందులోకి ఎంపీడీఓ కార్యాలయాన్ని మార్చారు. అప్పటి నుంచి ఈ భవనం బిచ్చగాళ్లకు నిలయంగా మారింది. ఈ భవనంలో చెత్తాచెదారం వేయడంతో దుర్వాసన వస్తోంది. ఈ భవనానికి మరమ్మతులు చేసి ఉపయోగించుకుంటే బాగుంటుందని ప్రజలు చర్చించుకుంటున్నారు.

– చెన్నేకొత్తపల్లి: